# నమస్తే తెలంగాణ

# నిర్మల్

5 | నిజామాబాద్, బుధవారం 17 జనవరి 2024 | NIRMAL


## త్వరలో అమెజాన్‌లో నిర్మల్ కొయ్య బొమ్మలు


నిర్మల్ కొయ్య బొమ్మలు

నిర్మల్ టౌన్, జనవరి16 : నిర్మల్ కొయ్య బొమ్మల విక్రయాలను అమెజాన్‌లో ప్రారంభించాలని నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్మల్ కొయ్య బొమ్మల తయారీపై డీఎఫ్‌వో, డీఆర్డీఏ, ఇండస్ట్రీ కళాకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొయ్య బొమ్మలు అంతర్జాతీయంగా ఖ్యాతి గడించాయన్నారు. కళాకారులకు ఉపాధి కల్పించేలా ఆన్‌లైన్ ద్వారా బొమ్మలను విక్రయించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బొమ్మల ప్యాకింగ్ కొరకు మహిళా సంఘాలకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో డీఎఫ్‌వో రాంకిషన్, డీఆర్డీవో విజయలక్ష్మి, ఇండస్ట్రీ అధికారి నర్సింహారెడ్డి, మేనేజర్ శంకర్, సొసైటీ అధ్యక్షుడు పెంటయ్య పాల్గొన్నారు.

## భైంసాలో స్వచ్ఛ్ భారత్ అభియాన్

భైంసా, జనవరి 16 : నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని మహదేవ్ మందిర్‌లో సోమవారం ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ 'స్వచ్ఛ్ భారత్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పీఎం నరేంద్రమోదీ అయోధ్యలో ఈ నెల 22వ తేదీన శ్రీరామ చంద్రమూర్తి ప్రాణ ప్రతిష్ఠ చేస్తున్నారన్నారు.ఇందులో భాగంగా ఆలయాలను పరిశుభ్రం చేస్తున్నామని తెలిపారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్ బాబు ఉన్నారు.


మహదేవ్ మందిర్‌లో పరిసరాలను శుభ్రం చేస్తున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

## పండుగ పూట విషాదం

- వేరేవేరు చోట్ల రోడ్డు ప్రమాదాలు
- ఇద్దరు మృతి.. మిన్నంటిన రోదనలు

*పండుగ పూట విషాదం నెలకొంది. 11 ఏండ్ల బాలుడు పతంగి కొనుగోలు చేయడానికి వెళ్లి తిరిగి వస్తుండగా టిప్పర్ కింద పడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో దవాఖానకు తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. 40 ఏండ్ల టక్కన్ కైలాస్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మృతిచెందాడు.*


సిద్ధార్థ్(ఫైల్)


కైలాస్(ఫైల్)

నిర్మల్ అర్బన్, జనవరి 16 : నిర్మల్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన బాలుడు సిద్ధార్థ్(11) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన రాజేందర్–సమలత దంపతులు స్థానిక ఇందిరానగర్‌కాలనీలో కొన్నేండ్లుగా అద్దెకు ఉంటున్నారు. తండ్రి డ్రైవర్‌గా పని చేస్తూ, తల్లి టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడైన సిద్ధార్థ్ స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులు కావడంతో సోమవారం పతంగి కొనుక్కోవడానికి వెళ్లి తిరిగి వస్తుండగా టిప్పర్(టీఎస్ యూబీ 4678) డ్రైవర్ అజాగ్రత్తగా నడుపడంతో ముందు టైర్ కింద పడ్డాడు. డ్రైవర్ వాహనాన్ని వదిలేసి పారిపోవడంతో స్థానికులు సిద్ధార్థ్‌ను అతి కష్టం మీద బయటకు తీశారు. ముఖం, చాతిపై తీవ్ర గాయాలు అయ్యాయి. బాలుడిని స్థానిక దవాఖానకు తీసుకెళ్లగా.. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందాడు. కుమారుడు మృతిచెందడంతో రోదనలు మిన్నంటాయి.

### ఎదురెదురుగా వాహనాలు ఢీకొనడంతో యువకుడు..

తానూర్, జనవరి 16 : నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని బోసి గ్రామానికి చెందిన టక్కన్ కైలాస్(40) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్‌ఐ సందీప్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కైలాస్ బెల్‌తరోడ గ్రామంలో టిఫిన్ సెంటర్ నడుపుతున్నాడు. సోమవారం ఉదయం 11 గంటలకు బెల్‌తరోడ నుంచి ద్విచక్ర వాహనంపై తానూర్ వైపు వెళ్లే సమయంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. భైంసా దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఇదే రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బెంబర్ గ్రామానికి మానిక్‌దాస్ నిజామాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కైలాస్ భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

# ఆస్తులు జప్తు

## పన్నులు చెల్లించకుంటే కార్యాలయాలకు తాళం

- రంగంలోకి దిగిన మున్సిపల్ అధికారులు
- బకాయిలపై బిల్ కలెక్టర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల నజర్
- రెడ్ నోటీసులు జారీ చేస్తున్న యంత్రాంగం

నిర్మల్ అర్బన్, జనవరి 16 : నిర్మల్ జిల్లా పరిధిలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్లపై అధికారులు దృష్టి సారించారు. మార్చి 31వ తేదీ లోపు చెల్లించకుంటే ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో పన్నుల వసూళ్లను వేగవంతం చేశారు. ఇటీవల కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ తిరుగుతున్నారు. కొందరికీ నోటీసులు కూడా జారీ చేశారు. నిర్మల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కొనసాగుతున్నది. యజమాని రూ.లక్ష బకాయి ఉన్నాడు. చెల్లించకపోవడంతో రెండు గంటలపాటు తాళం వేశారు. యజమాని చెల్లిస్తానని హామీ ఇవ్వడంతో తాళం తీశారు. పట్టణంలోని విశ్వనాథ్‌పేట్ కాలనీలోని ఓ ఫంక్షన్ హాల్ యజమాని రూ.12,09,041లు చెల్లించకపోవడంతో ఫంక్షన్ హాల్‌కు తాళం వేశారు. బకాయిలు చెల్లిస్తేనే తాళం తీస్తామని అధికారులు హెచ్చరించారు.


పన్నులు చెల్లించని ఫంక్షన్ హాల్‌కు తాళం వేస్తున్న మున్సిపల్ అధికారులు

### చెల్లింపులో నిర్లక్ష్యం..

నిర్మల్ మున్సిపాలిటీలో 23,809 అసిస్‌మెంట్లు ఉన్నాయి. ఇందులో రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్, మిక్స్‌డ్ కలిపి 21,077 ఉన్నాయి. వీటి ద్వారా యేటా ప్రభుత్వానికి రూ.3.18 కోట్ల ఆదాయం సమకూరుతున్నది. 100 ప్రభుత్వ కార్యాలయాల ద్వారా రూ.28.05 లక్షలు వస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ గృహ, వాణిజ్య యజమానులు పన్నులు చెల్లించకపోవడంతో పెనాల్టీతో కలుపుకుని నిర్మల్ మున్సిపాలిటీలో బకాయిలు రూ.15.31 కోట్లు పేరుకుపోయాయి. రూ.3.20 కోట్లు వసూలు కాగా.. రూ.12.11 కోట్లు వసూలు కావాల్సి ఉంది.

### కొరడా ఝులిపిస్తున్న అధికారులు

పన్నుల వసూళ్లలో అధికారులు, సిబ్బంది కొరడా ఝులిపిస్తున్నారు. పన్నులు చెల్లించని వారికి రెడ్ నోటీసులు జారీ చేస్తున్నారు. మొండి బకాయిదారుల వద్దకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు కూడా ప్రత్యక్షంగా వెళ్తున్నారు. బకాయిలు చెల్లించని వాణిజ్య గృహాలకు తాళం వేస్తున్నారు. మార్చి 31 వరకు చెల్లించకుంటే ఆస్తులను జప్తు చేస్తామని సూచిస్తున్నారు.


సబ్‌స్ట్రార్ కార్యాలయానికి తాళం వేసి నోటీసులు అంటిస్తూ..

### బకాయిల వివరాలు..

| మున్సిపాలిటీ | వార్డులు | అసిస్‌మెంట్లు | బకాయిలు | వసూలు చేసింది | వసూలు కావాల్సినవి |
|---|---|---|---|---|---|
| నిర్మల్ | 45 | 23,809 | రూ.15.31 కోట్లు | రూ. 3.20 కోట్లు | రూ.12.11 కోట్లు |
| భైంసా | 26 | 12,146 | రూ.7.24 కోట్లు | రూ.1.51 కోట్లు | రూ. 5.73 కోట్లు |
| ఖానాపూర్ | 12 | 7,004 | రూ.1.80 కోట్లు | రూ.50 లక్షలు | రూ.1.30 కోట్లు |

### ఆస్తులను జప్తు చేస్తాం..

*నిర్మల్ మున్సిపాలిటీలో ఎనిమిది బృందాలను ఏర్పాటు చేశాం. ప్రజలు, వ్యాపారులు ఇంటికొచ్చే బిల్ కలెక్టర్, మున్సిపల్ కార్యాలయం, ఆన్‌లైన్ ద్వారా పన్నులను చెల్లించే అవకాశం ఉంది. మొండి బకాయిదారుల ఆస్తులను జప్తు చేస్తాం.* **- గంగాధర్, రెవెన్యూ అధికారి, నిర్మల్**

## అర్హులందరికీ పీఎం జన్‌మన్ పథకం అందిస్తాం..

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్


సిలిండర్‌ను అందజేస్తున్న నాయకులు, అధికారులు


ఉట్నూర్, జనవరి 16 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం జన్‌మన్ పథకాన్ని అర్హులందరికీ అందిస్తామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఈ పథకాన్ని మంగళవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించగా.. ఈ కార్యక్రమాన్ని ఉట్నూర్‌లోని కుమ్రం భీం ప్రాంగణంలో స్క్రీన్‌పై ఎంపీ సోయం బాపురావ్, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే బొజ్జు, ఐటీడీఏ పీవో బాజ్‌పాయ్‌తో కలిసి వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ పథకం కింద జిల్లాలోని 197 ఆవాసాలలో సురక్షితమైన గృహనిర్మాణం, స్వచ్ఛమైన నీరు, పారిశుధ్యం, మెరుగైన విద్య, వైద్యం, పోషకాహారం, విద్యుత్, రహదారులు, టెలికాం వంటి ప్రాథమిక సౌకర్యాలను కల్పిస్తామన్నారు. అనంతరం ఉజ్వల యోజన పథకం కింద లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ కనెక్షన్, కుల, ఆధార్, జన్‌మన్ ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి నరేందర్ పాల్గొన్నారు.

### జీపీని సందర్శించిన అదనపు కలెక్టర్

లక్ష్మణచాంద, జనవరి16 : పొట్టపెల్లి(కె) గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఉద్యోగ క్రమబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్ జీపీని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఆయన సేవలపై ఆరా తీశారు. ఇంకా ఉన్నతంగా సేవలందిచాలని కార్యదర్శికి సూచించారు. ఆయన వెంట జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత, ఎఫ్‌ఆర్‌వో అవినాశ్ ఉన్నారు.

# ఆరు సబ్జెక్టులు.. ఏడు పేపర్లు..

**పదో తరగతి విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు**


పదో తరగతి పరీక్షల టైం టేబుల్


జామ్ బాలికల గురుకులంలో చదువుకుంటున్న విద్యార్థినులు

సారంగాపూర్, జనవరి 16 : పదో తరగతి పరీక్షలు మార్చి 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. వార్షిక పరీక్షల్లో సామాన్యశాస్త్రం(సైన్స్) సబ్జెక్టును ఇంతకముందు ఒక్క రోజే నిర్వహించే వారు. ప్రస్తుతం ఫిజికల్, బయోలాజికల్ సైన్స్ పేపర్లుగా విభజించి రెండు రోజులపాటు పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతి పేపర్‌కు 50 మార్కుల చొప్పున రెండు పేపర్లకు 100 మార్కులు ఉండనున్నాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎప్పటి నుంచో చేస్తున్న డిమాండ్‌ను ప్రభుత్వం ఎట్టకేలకు ఆమోదించింది. కాగా.. సారంగాపూర్ మండలంలో ప్రభుత్వ పాఠశాలలు 10, బాలికల గురుకులం 1, కేజీబీవీలు 1, ఆశ్రమ పాఠశాల 1, ప్రైవేట్ పాఠశాల 1 మొత్తం 14 బడులు ఉన్నాయి. వీటిలో బాలురు 144, బాలికలు 272 మంది విద్యార్థులు బోధన కొనసాగిస్తున్నారు.

### విద్యార్థుల కోరిక మేరకే..

గతంలో రెండు పేపర్లు ఒకే రోజు నిర్వహించడంతో చదవడం, రాయడంలో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. భౌతిక, రసాయనశాస్త్రం.. జీవశాస్త్రాలకు వేర్వేరుగా పాఠ్య పుస్తకాలు బోధించడానికి ఇద్దరు నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారు. కానీ.. ఒకే రోజు పరీక్ష నిర్వహించడంతో విద్యార్థులు అవస్థలు పడేవారు. గతంలో చాలా మంది విద్యార్థులు గందరగోళానికి గురై ఉత్తీర్ణత శాతం తగ్గిన విషయం తెలిసిందే. ఈ పరీక్ష వేర్వేరుగా నిర్వహించాలనే డిమాండ్ చాలా ఏండ్లుగా ఉంది.

### ఎంత పట్టుందో తెలుస్తుంది..

ఈ పరీక్షలను వేరువేరుగా నిర్వహించడంతో విద్యార్థులు తమ బలాలు, బలహీనతలు తెలుసుకోవచ్చు. ఆయా సబ్జెక్టులపై దృష్టి పెట్టేందుకు ఉపాధ్యాయులకు అవకాశం ఉంటుంది. గణితం, ఫిజికల్ సైన్స్‌లో భాగంగా ప్రతిభ చూపిన విద్యార్థులు ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంజినీరింగ్ రంగాల కెరీర్‌ను ఎంచుకోవచ్చు. బయోలాజికల్ సైన్స్‌లో ప్రతిభ చూపితే బాటనీ, జువాలజీ, మెడికల్, పారా మెడికల్, డెంటల్, వెటర్నరీ, అగ్రికల్చర్, ఫార్మసీ, నర్సింగ్ రంగాల్లో దూసుకెళ్లవచ్చు. మార్కులు కూడా అధికంగా సాధించవచ్చని సారంగాపూర్ ఎంఈవో మధుసూదన్ పేర్కొన్నారు.

# జల్సాలకు అలవాటు పడి..

- దొంగతనాలకు అలవాటు పడుతున్న యువకులు
- వెండి, బంగారం, మోటార్ సైకిళ్లు, ఆటోలు చోరీ
- నలుగురు అరెస్టు.. పరారీలో ఒకరు..
- ఆర్థిక నేరాల దర్యాప్తునకు ప్రత్యేక బృందం ఏర్పాటు
- ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం


వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఎదులాపురం, జనవరి 16 : ఆదిలాబాద్ పట్టణంలోని వన్ టౌన్, సీసీఎస్ పోలీసులు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకున్నారు. వీటికి సంబంధించిన వివరాలను సోమవారం ఎస్పీ గౌస్ ఆలం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణంలోని కైలాస్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఎజాజ్, రవీంద్రనగర్‌కు చెందిన టి. అజయ్, టీచర్స్ కాలనీకి చెందిన ఎం.రాజేశ్వర్, కొలిపురకు చెందిన షేక్ సమీర్, మహారాష్ట్రలోని కిన్వట్‌కు చెందిన సయ్యద్ మున్వర్‌లు జల్సాలకు అలవాటు పడ్డారు. కొన్ని రోజులుగా దొంగతనాలు చేస్తూ.. దొంగిలించిన వస్తువులను ఇతర ప్రాంతాల్లో అమ్ముకుని వచ్చిన డబ్బులతో సరదాలు చేసుకునేవారు. డబ్బులు అయిపోవడంతో మళ్లీ చోరీలకు పాల్పడేవారు. వీరు దొంగతనం జరిగిన ప్రాంతాలను సీసీ ఫుటేజీల ఆధారంగా పరిశీలించి గాలిస్తున్నాం. ఈ క్రమంలో సోమవారం వన్ టౌన్ సీఐ సత్యనారాయణ, సీసీఎస్ సీఐ డి.సాయినాథ్ ఆధ్వర్యంలో సీసీఎస్ సిబ్బంది వెతుకుతుండగా షేక్ ఎజాజ్‌ను పట్టణంలో అదుపులోకి తీసుకున్నారు. ఈయనను విచారించగా ఐదు మోటార్ సైకిళ్లు, నిజామాబాద్ జిల్లాలో ఒక ఆటో, రెండు మోటార్ సైకిళ్లు దొంగిలించి.. మహారాష్ట్రలోని కిన్వట్‌కు చెందిన బబ్లూఖాన్ రెండు మోటార్ సైకిళ్లు అమ్ముకున్నట్లు తెలిపాడు. మిగతా ఐదు మోటార్ సైకిళ్లు, ఆటో తన ఇంటి వద్ద ఉన్నాయని ఒప్పుకున్నాడు. అలాగే బబ్లూఖాన్‌కు అమ్మిన రెండు మోటార్ సైకిళ్లను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ వద్ద స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా గత నెలలో షేక్ ఎజాజ్, మొయిజ్‌లు హౌజింగ్ బోర్డులో దొంగిలించిన ఒక టీవీ, కెమెరా, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో నలుగురిని అరెస్టు చేయగా.. సయ్యద్ మున్వర్ పరారీలో ఉన్నట్లు తెలిపాడు. కాగా.. ఆర్థిక నేరాల దర్యాప్తునకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపాడు. ఈ సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు సత్యనారాయణ, సాయినాథ్, ఎస్‌ఐ లక్ష్మయ్య, ఐటీ కోర్ సిబ్బంది సంజీవ్‌కుమార్, ఏంఏ రియాజ్ పాల్గొన్నారు.

# పదవులకు రాజీనామా చేయాలి..

- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మే పరిస్థితి లేదు..
- మంత్రి సీతక్కకు సమస్యలు చెప్పడానికి వెళ్తే కండువా కప్పారు..
- తిరిగి సొంత గూటికి చేరిన సర్పంచ్‌లు
- మాజీ మంత్రి జోగు రామన్న


బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, జనవరి 16 : కేసీఆర్ ప్రభుత్వంలో పదవులు అనుభవించిన నేతలు బీఆర్‌ఎస్‌తోపాటు వారి పదవులకు రాజీనామా చేయాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలను ప్రలోభాలకు గురి చేసి బలవంతంగా పార్టీలో చేర్చుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీలో చేరికల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మాట్లాడారు. ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క నిర్మల్ జిల్లా పర్యటన సమయంలో తమ గ్రామాల సమస్యలను విన్నవించడానికి వెళ్లిన వారికి బలవంతంగా కండువాలు వేసి కాంగ్రెస్ పార్టీలో సర్పంచ్‌లు, నాయకులను చేర్చుకోవడం సరికాదన్నారు. తిప్ప గ్రామ పంచాయతీ సర్పంచ్ కిషన్, హత్తిగుట్ట సర్పంచ్ చందు, బేల మండల ఎస్టీ సెల్ నాయకుడు కుమ్ర రాజులకు కాంగ్రెస్ కండువాలు వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసిన నేతలు తమ పదవులకు కూడా రాజీనామా చేసి పార్టీలు మారాలని హితువు పలికారు. పార్టీలు మారడమే కాకుండా నాయకులను ప్రలోభాలకు గురిచేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. అనంతరం తిరిగి పార్టీలోకి వచ్చిన సర్పంచ్‌లు మాట్లాడుతూ.. తాము బీఆర్‌ఎస్ పార్టీని వదిలే ప్రసక్తే లేదని, రామన్న వెంట సైనికుల్లా పని చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు గోవర్ధన్, గండ్రత్ రమేశ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ, నాయకులు సొనేరావు, సంతోష్, కుమ్ర రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## లక్ష్మీనారాయణ స్వామిని దర్శించుకున్న ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్



జైనథ్, జనవరి 16 : భారతదేశ ఆర్‌ఎస్‌ఎస్ మార్గదర్శన్ వన్‌వాసి కల్యాణ్ చీఫ్ (ముంబై) సోమయాజులు మంగళవారం జైనథ్ శ్రీలక్ష్మీనారాయణ స్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించారు. ఆయనకు స్వామివారి చిత్రపటంతో పాటు శాలువా కప్పి సన్మానించించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి వామన్‌రావ్, దేవాదాయ శాఖ జూనియర్ అసిస్టెంట్ సాయి పాల్గొన్నారు.

జైనథ్‌లో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ సోమ యాజులను సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

# క్రీడోత్సవానికి ముస్తాబు

- నేటి నుంచి రాష్ట్రస్థాయి పోటీలు
- సర్వం సిద్ధం చేసిన అధికారులు
- ఏర్పాట్లను పరిశీలించిన ఐటీడీఏ పీవో
- ఉట్నూర్‌లోని కేబీలో ఏర్పాట్లు పూర్తి


కేబీ ప్రాంగణంలో సిద్ధమైన రన్నింగ్ ట్రాక్

ఉట్నూర్, జనవరి 16 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ పట్టణంలోని కుమ్రం భీం(కేబీ) ప్రాంగణం రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధమైంది. నేటి నుంచి 20వ తేదీ వరకు జరిగే పోటీల కోసం ఐటీడీఏ అధికారులు రూ.15 లక్షలతో కేబీలో హాకీ, ఫుట్‌బాల్, ఆర్చరీల కోసం మైదానాలు అందుబాటులోకి తెచ్చారు. 13 అంశాల్లో పోటీలు నిర్వహిస్తుండగా.. నేడు(బుధవారం) పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క.. రవాణా, బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు క్రీడలను ప్రారంభించనున్నారు. ఇందుకోసం ఉట్నూర్ ఐటీడీఏ చాహత్ బాజ్‌పాయ్ నిరంతరం అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించడంతోపాటు పనులను పర్యవేక్షిస్తున్నారు.

### నిర్వహించనున్న క్రీడలు

యేటా రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల మాదిరిగానే సొసైటీ లీగ్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. తుది జట్లను ఎంపిక చేసి ఐసీఎల్‌కు పంపిస్తారు. ఇందులో హాకీ, ఖోఖో, ఫుట్‌బాల్, కబడ్డీ, వాలీబాల్, టెన్నీకాయిట్, బాల్ బ్యాడ్మింటన్, చెస్, ఆర్చరీ, హ్యాండ్‌బాల్, రెజ్లింగ్, అథ్లెటిక్స్ క్రీడలు నిర్వహిస్తారు.

### పాల్గొననున్న ఐదు వేల మంది క్రీడాకారులు

గురుకుల ఇంటర్ సొసైటీ లీగ్‌ను ఉట్నూర్ ఐటీడీఏలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ సొసైటీ తరఫున నిర్వహిస్తున్నారు. దీని కోసం రాష్ట్రంలోని 14, 17, 19 విభాగంలో బాల, బాలికలు అన్ని సొసైటీల నుంచి 4 వేల మంది.. అంపైర్లు, కోచ్‌లు, మేనేజర్లు, పీడీలు, పీఈటీలు మొత్తం ఐదు వేలకు పైగా క్రీడాకారులు రానున్నారు. క్రీడాకారులకు అవసరమైన వేదికను కేబీ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. కేబీ కాంప్లెక్స్‌లోని క్రీడా పాఠశాల, ఏకలవ్య గురుకుల పాఠశాల ప్రాంగణం, పూలాజీ బాబా ఉన్నత పాఠశాల మైదానాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరుగనున్నాయి.

### పకడ్బందీగా క్రీడల నిర్వహణ



*ఐటీడీఏ ఆధ్వర్యంలో ఐఎస్‌ఎల్ క్రీడలను పకడ్బందీగా నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేశాం. క్రీడాకారులు, పీటీలు, పీడీలు, అధికారులు ఉండేందుకు వసతి, భోజనానికి ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే క్రీడాకారులు చేరుకున్నారు. క్రీడలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.*
**- దిలీప్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి, ఉట్నూర్.**


క్రీడాజ్యోతి ప్రాంగణం